

వెలుగు-చీకటి! వెలుగు-చీకటి! మెయిలు ప్లాటుఫారము విడిచి సాగిపోతూంటే పైనవున్న దీపపుకాంతి కిటికీలద్వారా లోనప్రవేశించినప్పుడు వెలుగు. రెండు కిటికీలమధ్య చీకటి.

మెయిలు ఊర్పుగుర్రంలా పరిగెడుతూంది. బహుళ త్రయోదశి రాత్రి కాటుకలాంటి చీకటిలో దూరపు కొండలు మరణానంతరం కూడా నాటబడే పాపపురాసుల్లా వున్నాయి. ఇంజను విడిచి వెడుతూన్న రాక్షసిపొగ్గు రవ్వలు చీకటి కడుపులో చిటపటలాడే ఆకలి నిప్పులవలె మెరుస్తున్నాయి.

అది కలకత్తా వెడుతూన్న మెయిలులో చిన్న పెట్టె. దాంట్లో క్రిందన నాలుగు బెంచీలు పైన రెండు బెంచీలు వున్నాయి. నేను విజయనగరం స్టేషనులో ఆ పెట్టెలో దూరబడగానే అందులో అదివరకే వున్న ఆరుగురు ఆసాములు అరుగొంతుకలతో అరుస్తూ నామీద విరుచుకు పడ్డారు:

"మేమంతా కలకత్తా వెళ్ళేవాళ్ళమండీ. రాత్రల్లా నిద్రలేక చావాలి. ఇంకో పెట్టెలోకి వెళదురూ."

"నేనూ కలకత్తా వెళ్ళేవాణ్ణే. ఇంకో పెట్టె అంటూ వుంటేగా వెళ్ళడానికి" అన్నాను సామాను పడేస్తూ.

ఐదుగురు పూర్తిరాత్రి ప్రయాణీకులు, ఆరు బెంచీలు! ఈ సమస్య తేలడం ఎలాగ? మొహం ముడిపెట్టుకొని బెంగాలీఆయన చేతిఅద్దంలో చూసుకొంటూ వెంట్రుకలు లేకపోయినా, తల గబగబ దువ్వుకొంటూ నలభైఅయిదు డిగ్రీల కోణంలో నావేపొకసారి చూశాడు. జోడు విప్పి బెంచీకింద తోస్తూంటే "కోడిగుడ్లున్నాయండోయి జాగ్రత్త" అన్నాడు ఒక నాయుడు గారు. క్రిందనున్న మిగిలిన యిద్దరూ మీదనున్న ఒక ఆయనా స్నేహంగానే మాట్లాడేరు. ఆరో ఆయన యేదో, చవకబారు అపరాధ పరిశోధక నవల తిరిగి చదవ నారంభించాడు.

ఆరో ఆసామీ కుడిచేతి బంగారంమురుగు, ఉంగరాలలో రాళ్ళు, బెంగాలీ ఆయన బీడీ కాల్చినప్పటి వెలుగులో మెరిసాయి.

రైలు మహాఘోష పెడుతూ పరిగెడుతోంది. దూరపు పల్లెల ఇళ్ళల్లో దీపాలూ, అనంతాకాశంలో వెలిగే నక్షత్రాలూ, మిన్నుమన్ను ఏకం చేస్తున్నాయి. నా పడక ఇంకా యెక్కడో, నిశ్చయం కాలేదు. నాగావళీ వంతెనమీంచి రైలు

అంగర వెంకటకృష్ణారావు

జారిపడుతూంటే అది భూమిని బద్దలు కొట్టుకొని పాతాళలోకం ప్రవేశిస్తుందేమో అనిపించింది. దూసి స్టేషనులో మరో ముగ్గురు ప్రయాణీకులు మా పెట్టెలో చేరగానే మా పరిస్థితి బహు క్లిష్టంగా కనుపించింది. అందరం అరనిముషం మీటింగు చేసి స్టేషనుమాష్టరుతో రిపోర్టు చేసాం. ఆయన మరో అరనిముషం ఆకాశంమీద వున్న నక్షత్రాలతో సంప్రదించి చివరకు మామీద జాలిపుట్టి "పలాసాలో మరో పెట్టె తగిలించేటట్లు చేస్తాం" అన్నాడు. ఎలాగూ క్రిందకు దిగేం కదా అని ప్రసిద్ధికెక్కిన దూసి పూరీలను కొనుక్కొని మా పెట్టె చేరుకున్నాం.

మేమంతా యెవరెవరు పలాసాలో క్రొత్త పెట్టెలోకి మారాలో, మారినవాళ్ళు రాత్రి పట్టుకి ఏమేం సామాన్లు తీసుకొని వెళ్ళాలో మొదలైన విషయాలు చర్చించుకొంటున్నంత సేపూ, ఆరో ఆసామీ తన మంచంలో టార్చి లైటు వెలిగించి యెత్తుగాలక దుక్కలో వంచిన పదునుతో పాకాళ్ళమీద కూర్చొని చిన్న అద్దంలో చూసుకొంటూ శృంగారించుకొంటున్నాడు. గిరజాలు తిరిగిన తల దువ్వుకొని కనుబొమలు తువ్వాలుతో తుడుచుకొంటూ కోర మీసాలికి విడిపోతూన్న మెలి తిరిగ వేసుకున్నాడు. పావురాగూడు లాంటి మీద బెంచీ మీద చాలాసేపు ఇరుక్కొపడటం నించి అతని యెముకలు నొప్పెట్టాయి కాబోలు "కొత్త పెట్టెలోనికి నేనూ వెడతానండోయ్" అన్నాడు.

ఆకలిగా వున్నవాడి విస్తట్లో అన్నం పడినట్లు పలాసా స్టేషను వచ్చింది. కొత్తపెట్టె తగిలించారు. అది చాలా పెద్దపెట్టె ఇరవై మంది హాయిగా పడుకొనడానికి సరిపడిన ఓల్డుయింటర్ క్లాసు పెట్టె.

ఆ చీకటిలో ఎవరు వచ్చేరో లేదో గాని ఆరో ఆసామీ మాత్రం వచ్చాడు.

మే మిద్దరం పెట్టెకి రెండు ప్రక్కలా వున్న బల్లలమీద బిచానాలు విప్పాం. టైము సుమారు యెనిమిదిన్నర అయింది. ఏదో కారణంచేత మెయిలు ఆ స్టేషనులో పదిహేను నిముషాలుండే పరిస్థితి యేర్పడినట్లు తెలిసింది. నేను లేచి ఆరో ఆసామీతో స్నేహం కలిపి కాలం వెళ్ళబుచ్చుదామని బుద్ధిపుట్టి అతని దగ్గరికి వెళ్ళి కూర్చున్నాను. నేను దగ్గరకి రాగానే సగం పడుకొని సగం కూర్చొన్న భంగిమ మార్చి, కాళ్ళు ముడుచుకొని, సరిగా కూర్చున్నాడు. కిటికీగుండా లోపలపడుతూన్న లైటువెలుతురులో అతని ముఖంమీద చిన్న అహ్వాన సూచకమైన చిరునవ్వు, వెనువెంటనే బంగారపు పన్ను యొక్క తళుకు గోచరించాయి.

వెంటనే అతడు జేబులోంచి రెండు కిళ్ళీలు తీసి నాకొకటిచ్చి అతనొకటి వేసుకొన్నాడు. సిగరెట్టు ఇవ్వబోతే నాకు అలవాటు లేదని సాభిమానంగా వారించాను. అది అతడు వెలిగించి అందరివలె రెండు వేళ్ళతో కాల్చకుండా చేతిని శంఖంలా చేసి రెండు దమ్ములు లాగి రెండుసార్లు చిటిక వేశాడు, బూడిద రాలిపోయేందుకు.

"మీరు యెక్కడికి వెళుతున్నారండీ బాబూ" అని ప్రశ్నించాడు.

"మొదటనే తనని నేను కదండీ కలకత్తాకని."

"ఇదే వెళ్ళటమా మొదటిసారైనా వెళ్ళేరా" అన్నాడాయన బొగ్గుపడిన కళ్ళు నులుపుకొంటూ సిగరెట్టుపొగ వైపొదుల్తూ. నేను ఒక్క సెకెండాలోచించి 'ఇదే వెళ్ళడమండీ. తమరో ?' అన్నాను.

"సరే నామాటకేంలెండి. ఇవాళ కలకత్తాలో, రేపు కాన్పూరులో, ఎల్లుండి ఢిల్లీలో, అవతల్నాడు పెషావరులో ఉండేవాణ్ని."

నేను 'మహాగా ఉన్నాయిరా మాటలు' అనుకొని, బొత్తిగా తెలియని పద్దమ్మలా నటిస్తూ, "కొత్తవాళ్లకలకత్తా వెళితే గాభరాపడిపోతారని వినికిడి నాదగ్గర యెంత్రను వుందిలెండి. ఏ జట్కావాడి నడిగినా చెబుతా డనుకొంటాను" అన్నాను.

అతడు మొహం అదోలా పెట్టి అసహ్యంగా నవ్వేడు. "కలకత్తాలో జట్కా లేమిటయ్యా! కాకినాడను కొన్నావా, సామర్లకోట ను కొన్నావా? అది మహా పట్నం. ఆ జనమేమిటి! ఆ కార్లేమిటి! ఆబస్సు లేమిటి! ఓవరాలనించి ట్రాములు. ఓప్రక్కనించి సైకిళ్ళ ఓస్టునుంచి మిలటరీ లారీలు. మావంటి అలవాటుపోయిన వాళ్ళకే భయంవేస్తుంది." అన్నాడు పిల్లిగడ్డ

లార్చివెయ్యి పైకిలేసి బంగారప్పు వాచీలో టైము చూస్తూ.

"ఐతే అక్కడ వాళ్ళంతా మంచివారట. దొంగతనాలు చెయ్యరట కదండీ."

అతడు నిక్కి పడి చూశాడు. "ఎవరు చెప్పారయ్యా నీకు! కాలుకింద కన్నం వేసే గారడీ దొంగలు. ఒకమాటు ఏమైందో తెలుసా? పట్టపగలు పన్నెండు గంటల వేళ నేను ధరమ్ తలాలోంచి వస్తూంటే..."

"అంటే అదొక హోటేలా బాబూ"

"కాదు, కాదు. ఓ పెద్దవీధి. వస్తూంటే ఒకడు వెనకపాటునే జేబులో చెయ్యిలాగి పారిపోబోయాడు. వాణ్ణి రెండడుగుల్లో పట్టుకొని గూబ మీద మూడు లాగేసరికి .." అని అతడేమిటో చెబుతూంటే రైలు కూసి కదిలింది.

వెలుగు! చీకటి! వెలుగు! చీకటి! మా పెట్టె మొత్తానికి నలుగురమే వున్నాం. నేనూ ఆరో అసామీ మేల్కొనివున్నాం. మిగిలిన ఇద్దరూ ఒకమూలని చీకట్లో గుబ్బు పెట్టినిద్రబోతున్నారు. మా పక్కలు పెట్టెకి మధ్యగావున్నాయి. నేను లేచి నా పక్కమీదకి వెళ్ళిపోయాను. పడుకొన్నాను గాని నిద్రరావడం లేదు. ముందున్న నా ప్రయాణంగురించి ఆలోచించుకొంటున్నాను. ఎక్కడ కలాసా, ఎక్కడి 'షిల్లాంగ్.' ప్రయాణం అంటే పరిపాటయిపోయిన నాకు ఆరో అసామీ మాటలు వినోదం కలిగించాయి. అతని మీదుగా ప్లాటుఫారంవెంపు చూస్తూంటే వెలుగు చీకట్లు మజా చూపిస్తూంది. అతడు కిటికీలోంచి బుఱ్ఱ పైకిదూర్చి తిన్నగా చూస్తూ సిగరెట్టు పీలుస్తున్నాడు.

ఈ వెలుగు చీకట్ల గారడీలలో ఒకవ్యక్తి రైలు నడుస్తూంటే మా పెట్టెలో ప్రవేశించి మా వాళ్ళ వెంపున్న మూలను కూర్చొన్నట్టు నేను గ్రహించాను.

రైలు జోరుగా పరిగెడుతోంది. ఆరో అసామీ తల లోపటికి తీసుకొని కాళ్ళక్రిందకి పెట్టి సిగరెట్టు పీలుస్తూ "అల్లుడా రమ్మని" అనే పద్యం మాండు రాగంలో నాకు వినిపించేటంత



గట్టిగా నవ్వుతున్నాడు. నేను మాత్రం ఆ చీకట్లో మెరుస్తున్న మా తన వ్యక్తి కళ్ళవెంట చూస్తున్నాను. కళ్లు మూసుకొన్నానని ఆరో ఆసామీ భావించి వుండవచ్చు.

హఠాత్తుగా 'కాంతా' సెంటు వాసన వచ్చింది ఆ మూలనించి. ఆరో ఆసామీ అటు తేరి చూసినట్టు గమనించాను. అతడు గట్టిగా ఒక దగ్గు దగ్గేడు. వెల్తురు లేకపోయినా లాల్చీ జేబులోంచి వాచీ చూసుకొంటున్నట్టనిపించింది. మళ్ళీ సర్దుకొని కూర్చొని చేతులు కట్టుకొని ఈలపాట ప్రారంభించాడు. మరొక్క రెండు నిముషాలకి ఆ వెంపునించి ఒక ఇంపైన కంకణ ఝణత్కారం వచ్చి ఆరో ఆసామీలో ఒక వింతైన చలనం కలిగించింది. అతడు లేచి "పంతులుగారూ" అని నన్ను పిలిచేడు మెల్లా కొంచెం వినిపించేటట్టు, నిద్రపోతూంటే మెలకువ రానంత గట్టిగా. నేను మాత్రం అవసరమైనప్పుడు కళ్లు మూస్తూ, తరవాత తెరవవలసినప్పుడు కళ్లు తెరచి ఈ నాటకాన్ని చూస్తున్నాను. నా దగ్గరనించి జవాబు లేకపోగానే, నేను నిద్రపోతున్నానని నిశ్చయించాడు మన. ఈలాగా పరాకుగా ఉన్న ఆయన మనస్సును ఘల్లుమని తిరిగి గాజులు మ్రోగి ఉద్రేకింపజేశాయి. మధుపవలోదో చింతామణిలోదో ఒక శృంగారపద్యం పాడుకొన్న వారికి మెలకువ రానంత గట్టిగా చదువనారంభించాడు. ఆ ఓఢ్రదేశపు చీకటిలోంచి వచ్చిన ఆ గాజులచప్పుడులో ఈ వెఱ్ఱి వానికేమైనా తెలుగు పలుకులు వినిపించాయో ఏమో!

కాని అతడక్కడనుంచి కదలడం లేదు. మనస్సు తొందర పెడుతూన్నా కాళ్లు కదలలేనట్టు తోచింది. ఒక తియ్యని ఆహ్వానసూచకమైన దగ్గు వినవచ్చేసరికి అతడు మొండిధైర్యం తెచ్చుకొని లేచి అటు వెంపు రెండడుగులు వేసి మళ్ళీ ధైర్యం దిగజారిపోయి గేటువెంపు తిరిగి బుఱ్ఱ పైకెత్తి ఒకసారి ఉమ్మ్యకొని తిరిగి తన స్థలము నకువచ్చి కూర్చోబోతూంటే అవమానకరమైన ఒక నవ్వువినిపించింది, ఆ చీకటిలో మనిషి. ఆనవ్వు "ఓరి పిరికివెధవా" అన్నట్టుగా ఉంది. అతను కోపంగా లేచాడు. నా మీదికి వంగి చూశాడు. [illegible] వెంట చూశాడు.

వచ్చిన మనిషి తో పోకపోయినాడు. తిరిగి పిరికితనం ప్రవేశించింది గాబోలు కూర్చుండి పోయాడు.

వచ్చిన మనిషి లేచింది. చేయి దులిపేసరికి తెల్లటి చేరుమాలు మడతలలోంచి విముక్తి పొందిన కాంతా సెంటువాసనలు గుప్పుమన్నాయి. మెరుపువెంట ఉరుములాగ గాజులు "ఘల్" మన్నాయి. ఆ స్త్రీ అతని వెంట నడచివచ్చి అతని ప్రక్క కూర్చొన్నది; చీకటిలో ఎక్కువగా కనిపించలేదు కాని అతని భయం, వారించడం, స్నేహితులున్నారని చెప్పడం, ఆమె ధైర్యం చెప్పడం, సముదాయించడం, స్వప్న వృత్తాంతాల్లా అందీ అందకుండా గోచరించాయి. తరువాత కొంతసేపటికి రెండుమూడు ముద్దులు పెట్టుకొన్నట్టుగాకూడా శబ్దం వినిపించింది. మరొక్క ఐదునిముషాలకి ఆదేదో స్టేషనుకి రెండు ఫర్లాంగుల దూరంలో రైలాగింది. "ఎవరైనా చూస్తారేమో దూరంగా కూర్చొంటాను. బండి రాదోయ్ స్టేషను దాటగానే వస్తాను. పదిరూపాయిలు జ్ఞాపకం ఉందా?" అంది ఆమె "పదికాకపోతే పాతిక, దానికేంలే. వెళ్లు, వెళ్లు. నేను పడుకొన్నట్టు నటిస్తాను."

పక్క స్టేషను ప్లాటుఫారము వచ్చింది. ఆరో ఆసామీ పడుకొన్నట్టు నటిస్తూ నన్ను మోసగిస్తున్నాననుకొని మోసపోతూన్నాడు. వెలుగు! చీకటి! వెలుగు! చీకటి! ఒకమాటు గేటుమీద చీకటి పడగానే ఆ స్త్రీ అరక్షణకాలంలో ఆ క్రీనీడలో గేటులోంచి బయటకి దూకేసింది. రైలు రెండు నిముషమాగింది. మళ్ళీ కదిలింది. ఆరో ఆసామీ, నాటకంలో మార్చిపోయి లేని పాత్రలాగ, లేచి కూర్చొని ఆ చీకటి వెంపు చేయిజాపి పిలుస్తున్నాడు. రైలు క్రమేపీ జోరెక్కుతోంది. కొంత సేపటికి లేచి ఆమె కూర్చున్న స్థలం దగ్గరికి వెళ్ళి వెతికి (ఆశ్చర్యపోయి) గదిఅంతా వెతికి, దొడ్డి తలుపుతీసి దానిలోకూడా చూసి సిగరెట్టు వెలిగించి గేటులోంచి బుఱ్ఱ పైకెత్తి దిక్కుపోయిన శూన్యంలోకి చూస్తున్నాడు.

నేను అప్పుడే మేలుకొన్నట్టు లేచి "ఏమండీ ఇంకా నిద్రపట్టలేదా" అని ప్రశ్నించాను.

అతడు గబుక్కున మళ్లీ లోపలికి తిరుగొచ్చి "నిద్ర!" అని నోరెళ్ల బెట్టాడు. మరు నిముషములో దర్జాగాని "ఈ పెళ్ళి స్టేషన్లో ఎక్కేవాడూ లేడు. దిగేవాడూ లేడు. చూడండి! మనం ఈ పెట్టెలో ఎక్కిన దగ్గరనుంచీ ఒక్క పిట్ట మనిషైనా కనిపించలా" అన్నాడు దొంగ మాటన్నలో.

"ఏమో ఎవరెక్కారో! మేమమాత్రం గుర్రు తీసి నిద్రపోతాము. కాని ఈ ఉత్తర దేశపు అడవిలో, చీకటి రాత్రుళ్లలో, రైలుప్రయాణం జాగ్రత్తగా చెయ్యాలి. మా వంటి అలవాటైన వాళ్ళకి పరవాలేదనుకోండి. కాని, చూశారూ, ఈ కిరాణ్యం యేం బాగుండదో. దీనిలోకి పిల్లకారిపోయిందంటే భీకరుండదు."

అతని దొంగచూపులు కనిపెట్టినట్టుంది. అతనికి భయంకరంగా లేచినట్లుంది గబగబా పక్క దగ్గరకువచ్చి కిటికీ తలుపు తడిమేడు.

"కాలు మునిగిపోయినట్లుంది" అని అరిచేడు.

"ఏమైందేమిటి."

"చేతి పెట్టె పోయింది"

"డబ్బుందా దాంట్లో?"

"మూడు వేలదాకా!"

"ఎవరొచ్చారిక్కడికి!"

అతని నాలిక అంగుటికి అంటుకుపోయింది కాబోలు; జవాబు రాలేదు.

---

★

లండన్‌లో భారతదేశపు చీరల ప్రదర్శనం: కడచిన నాలుగు శతాబ్దాలలోనూ భారతీయ స్త్రీలు ధరిస్తూ వచ్చిన రకరకాల చీరల ప్రదర్శనం ఆమధ్య లండనులోని ఇంపీరియల్ ఇన్‌స్టిట్యూట్ యాజమాన్యాన జరిగింది. ప్రదర్శించబడ్డ చీరలన్నీ శ్రీమతి నీలిమా బారువావి. (ఎడమ నుండి మొదటి స్త్రీ.)

★

